రాష్ట్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆలోచనలను, ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా అడుగులేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభం కానుంది. ఏపీఐఐసీకి చెందిన భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నూతన ఆలోచనలు..

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- నెలలోపు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమయ్యే అవకాశం
- తాత్కాలికంగా ఏపీఐఐసీ భవనంలో ఏర్పాటు
- రూ.50 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం

ప్రపంచీకరణకు తోడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎప్పటికప్పుడు వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లోనూ, యువతరంలోనూ నూతన ఆలోచనలను, నవ్య ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు అవసరమైన శాస్త్ర సాంకేతిక, ఆర్థిక తోడ్పాటును అందించడానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారు. ఆ క్రమంలో రతన్ టాటా స్ఫూర్తితో ఆయన పేరిట ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అమరావతి కేంద్రంగా పనిచేసే ఈ హబ్‌కు అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, ప్రకాశం, అనంతపురం, తిరుపతి జిల్లాలలో ఇన్నోవేటివ్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాతిపదికన ఏర్పాటయ్యే ఈ సెంటర్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.50 కోట్లు కేటాయించనుంది. ఆపై ఏటా రూ.30 కోట్లు కేటాయిస్తుంది. టాటా ట్రస్టు నిర్వహించే ఈ సెంటర్‌కు ఓఎన్‌జీసీ, కియా, ఎల్ అండ్ టీ, ఎల్జీ, దివీస్, డాక్టర్ రెడ్డీస్, అమరరాజా తదితర పది ప్రతిష్ఠాత్మక సంస్థలు భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. ప్రభుత్వం, టాటా ట్రస్టులతో పాటు ఈ సంస్థలు సైతం సెంటర్ నిర్వహణకు మ్యాచింగ్ గ్రాంట్ కింద నిధులు ఇవ్వనున్నాయి. స్టార్టప్‌లను పెంచడమే ఈ సెంటర్ ఏర్పాటు ఉద్దేశం. దానికనుగుణంగా విద్యార్థులను, పెట్టుబడిదారులను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఒకచోట చేర్చి స్టార్టప్‌లను విజయవంతం చేయడానికి ఈ సెంటర్ అవసరమైన అన్ని చర్యలకూ సహకరిస్తుంది.

ఎయిర్‌పోర్టు వద్ద తాత్కాలిక భవనంలో..

జిల్లాకు సంబంధించి ఇన్నోవేటివ్ సెంటర్ కోసం ప్రస్తుతానికి తాత్కాలిక భవనాలను గుర్తించారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలో ఏపీఐఐసీకి సంబంధించిన నిరుపయోగ భవనాలను కలెక్టర్ ఎంపిక చేశారు. గతంలో ఆ భవనాలలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం నడిచేది. కార్యాలయాలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశించడంతో ఇటీవలే ఆ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ భవనాల్లో తాత్కాలికంగా ఇన్నోవేటివ్ సెంటర్ ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. దీనిపై ఇటీవల ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ జిల్లా అధికారులతో చర్చించారు. ఈ భవనాల్లో ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం వేగంగా చర్యలు తీసుకుంటోంది.

శాశ్వత భవనాలకు రెండు చోట్ల భూముల గుర్తింపు

రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్‌కు శాశ్వత భవనాలు నిర్మించడం కోసం ఐదెకరాల అనువైన భూముల కోసం జిల్లా యంత్రాంగం అన్వేషిస్తోంది. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన కీలక కేంద్రం కావడంతో దీన్ని జాతీయ రహదారి పక్కనే నిర్మించాలని కలెక్టర్ భావిస్తున్నారు. అందులో భాగంగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి పక్కన ఉండేలా తిరుపతి రూరల్ మండలం దామినీడు వద్ద, అలాగే రేణిగుంట వద్ద భూములు గుర్తించారు. వీటిని ఐటీ శాఖ ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి ఒకదాన్ని ఖరారు చేయనున్నారు.



మొదటి బహుమతి కూపన్ తీస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

మొదటి బహుమతి
(మోటారు సైకిల్)
డి.వత్సల,
19-7-104, ఎ,
గోపాలరాజు కాలనీ,
తిరుపతి

ద్వితీయ బహుమతి
(రిఫ్రిజిరేటర్)
నరేష్ మరుదాడ,
18-1-26/జి6,
భారతీ నిలయం,
కపిలతీర్థం రోడ్డు,
తిరుపతి

తృతీయ
బహుమతి (టీవీ)
టి.కె.శశిధర్, 3-56,
పాతపేట,
నెహ్రూనగర్,
పలమనేరు

'ఆంధ్రజ్యోతి' పాఠకులకు

బహుమతుల బొనాంజా





రెండు, మూడు బహుమతుల కూపన్లను తీస్తున్న 'వేము' ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు.. డాక్టర్ వెంకటరమణ

- కూపన్లు తీసి విజేతలను ఎంపిక చేసిన ముఖ్య అతిథులు

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకులకు కార్ అండ్ బైక్ రేసు పోటీకి సంబంధించి మంగళవారం లక్కీ డ్రా జరిగింది. గతేడాది నవంబరు ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నడుమ నెలకు మూడు చొప్పున మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా వేలాది మంది పాఠకులు ఎడిషన్ కార్యాలయానికి పంపారు. వీటిని మంగళవారం సాయంత్రం రేణిగుంట మండలం దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఈ కూపన్లను డ్రా తీశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, 'వేము' ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు, తిరుపతికి చెందిన వెంకటరమణ గుండె, మెటర్నిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ వెంకటరమణ.. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కూపన్లు తీసి విజేతలను ప్రకటించారు. అనంతరం ముఖ్య అతిథులు ఆయా విజేతలకు ఫోన్లు చేసి బహుమతులు గెలుచుకున్న విషయం తెలియజేసి శుభాకాంక్షలు చెప్పారు. వీరికి త్వరలో ఎడిషన్ కార్యాలయంలో సంబంధిత బహుమతులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, తిరుపతి బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌ఛార్జి వి.సుధాకరబాబు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఉమాపతి, ఏడీవీటీ ఇన్‌ఛార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి మోహన్‌రావు, బ్యూరో ఇన్‌ఛార్జి శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పలువురు ఆంధ్రజ్యోతి పాఠకులు పాల్గొన్నారు.

కన్సొలేషన్ బహుమతుల వివరాలు 8లో

కీచక గురువు సస్పెన్షన్

తిరుపతి(విద్య)/చిల్లకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన కీచక గురువు సస్పెండయ్యారు. డీఈవో కేవీఎన్ కుమార్, డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిల్లకూరు మండలం తిక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మధుబాబు ఓ విద్యార్థినిపట్ల అసభ్యంగా వ్యవహరించారు. దీనిపై విచారణకు గూడూరు ఉప విద్యాశాఖాధికారిని డీఈవో ఆదేశించారు. ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా మధుబాబును సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో వెల్లడించారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేవీబీపురం, యర్రావారిపాళెం, వెంకటగిరి, తడ, మావిళ్లపాడు మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిలో 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వీరికి ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశం ఉంటుందన్నారు. 'ఇంటర్‌లో చేరేందుకు మే 2లోగా దరఖాస్తు చేసుకోవాలి. వీరికి 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు.

జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యం రూ.1.08 లక్షల కోట్లు

- తలసరి ఆదాయ లక్ష్యం రూ.4.08 లక్షలు
- ఈ ఏడాది అంచనా రూ.3.45 లక్షలు
- కలెక్టర్ల కాన్ఫరెన్సులో వెల్లడైన వివరాలు

వచ్చే నెల ఒకటి నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిల్లా స్థూల ఉత్పత్తి రూ.1.08 లక్షల కోట్లు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. తలసరి ఆదాయాన్ని రూ.4.08 లక్షలుగా లక్ష్యం ప్రకటించింది. ఇక, జిల్లా స్థూల ఉత్పత్తి విషయంలో మూడేళ్ల కిందట రెండో స్థానంలో ఉన్న జిల్లా క్రమేపీ మూడో స్థానానికి దిగజారింది. అలాగే తలసరి ఆదాయంపరంగానూ మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. అమరావతిలో మంగళవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో జిల్లాకు సంబంధించిన పలు అంశాలు, గణాంకాలు వెల్లడయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సదస్సులో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధనరాజు, కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,08,651 కోట్లు జిల్లా స్థూల ఉత్పత్తి సాధించాలని లక్ష్యం ప్రకటించింది. ప్రభుత్వ గణాంకాలను చూస్తే.. 2022-23లో జిల్లా స్థూల ఉత్పత్తి రూ.76,500 కోట్లు ఉండగా, 2023-24లో రూ.81,619 కోట్లకు చేరింది. ఈ నెలాఖరుతో ముగుస్తున్న 2024-25లో రూ.91,478 కోట్లుగా అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.17,173 కోట్ల వరకు స్థూల ఉత్పత్తి పెంచాలని నిర్దేశించింది.

- ఇక, రాష్ట్ర జీడీపీకి జిల్లా నుంచీ 2022-23లో 5.84 శాతం, 2023-24లో 5.74 శాతం వాటా అందింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక నెలాఖరుతో ముగుస్తున్న 2024-25లో 5.74 శాతం వాటా చేరింది. ఈ క్రమంలో కొత్త ఆర్థిక సంవత్సరంలో 5.82 శాతంగా టార్గెట్ విధించింది.
- 2022-23లో జిల్లా స్థూల ఉత్పత్తిలో ఏపీలో విశాఖ తర్వాత తిరుపతి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర జీడీపీకి వాటా విషయంలోనూ రెండో స్థానంలో ఉండింది. రాయలసీమ పరంగా మొదటి స్థానం దక్కించుకుంది. 2023-24లో విశాఖ, ఎన్టీయార్ జిల్లాల తర్వాత తిరుపతి మూడో స్థానానికి దిగజారింది. రాష్ట్ర జీడీపీకి వాటా అందించడంలోనూ మూడో స్థానమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ మూడో స్థానంతోనే సరిపెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం లక్ష్యాల్లోనూ విశాఖ, ఎన్టీఆర్ జిల్లాల తర్వాత తిరుపతి మూడో స్థానంలో ఉంది.

తలసరి ఆదాయంలో నాలుగో స్థానం

2022-23లో రూ.2,89,919తో విశాఖ, కృష్ణా జిల్లాల తర్వాత తిరుపతి జిల్లా నిలిచింది. 2023-24లో రూ.3,08,176లతో విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల తర్వాత నాలుగో స్థానానికి చేరింది. 2024-25లో రూ.3,44,989 తలసరి ఆదాయం అంచనాల మేరకు నాలుగో స్థానంలోనే కొనసాగుతోంది. 2025-26లో రూ.4,08,702 ఉండేలా ప్రభుత్వం లక్ష్యం విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 18.47 శాతం పెంపుతో.. రూ.63,712 పెంచాలి.

ఆధార్ పెండింగ్ 0.02 శాతమే

జిల్లాలో ఈనెల 22వ తేదీ నాటికి కేవలం 40 మందికి మాత్రమే ఆధార్ కార్డులు (0.02 శాతం) జారీ చేయాల్సి ఉంది. అదే సమయంలో 3009 మంది చిన్నారులకు మాత్రమే ఆధార్ కార్డులు ఇవ్వాల్సి ఉంది.

ఫిర్యాదుల పరిష్కారంలో 12వ ర్యాంకు

ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లాకు 12వ ర్యాంకును ప్రకటించింది ప్రభుత్వం. వివిధ అంశాలకు మొత్తం 70.99 పాయింట్లు జిల్లాకు లభించాయి. అందులో ఫిర్యాదులను స్వీకరించే విషయంలో 8.40 పాయింట్లు రాగా, గడువులోగా పరిష్కరించడంలో 19.44, ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం సాధించడంపై 14.87, వీఐపీల ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించడంలో అత్యధికంగా 18.20 పాయింట్లు లభించాయి. వీఐపీల ద్వారా వచ్చిన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారాలను సాధించిన అంశానికి 10.09 పాయింట్లు వచ్చాయి.

అధికారుల తీరుపై విరుద్ధ ఫలితాలు

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారుల తీరుపై నిర్వహించిన సర్వేలో పరస్పర విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. దీని కోసం ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 902 మందికి ఫోన్‌కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ సేకరించింది. 27 శాతం మంది అధికారుల తీరు బాగా లేదని చెప్పగా 11 శాతం మంది అసలు తమను సంప్రదించనే లేదని చెప్పారు. 57 శాతం మంది తమతో అధికారులు బాగా వ్యవహరించారని చెప్పగా కేవలం 5 శాతం మంది మాత్రమే అధికారులు చాలా బాగా స్పందించారని చెప్పారు. మొత్తమ్మీద 62 శాతం మంది అధికారుల తీరు పట్ల సంతృప్తి చెందినట్లు ఈ సర్వే ద్వారా తేటతెల్లమైంది. కాకపోతే ప్రభుత్వ యంత్రాంగం పనితీరు పట్ల స్టార్ రేటింగ్ సేకరించే క్రమంలో దానికి విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. 63.3 శాతం మంది వన్ స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేయగా కేవలం 5.7 శాతం మాత్రమే ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీజీఆర్‌ఎస్ వ్యవస్థను ఇతరులకు సిఫారసు చేస్తారా అన్న ప్రశ్నకు 95.91 శాతం మంది చేస్తామని చెప్పారు. అత్యధికులు అనుకూలంగా స్పందించడం ద్వారా జిల్లా ఆరో స్థానంలో నిలిచింది.

'ఉపాధి'లో లక్ష్యాలకు మించి పనులు

జిల్లా యంత్రాంగం ఉపాధి హామీ పథకం నిధులతో లక్ష్యాలకు మించి పనులు చేపట్టిందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాది ఉపాధి నిధులతో పశువులు నీరు తాగేందుకు 415 తొట్టెలు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించగా, జిల్లాలో 1684 నీటి తొట్టెలను నిర్మించారు. ఉపాధి పథకం కింద కూలీలకు 97.01 లక్షల పనిదినాలు సృష్టించిన జిల్లా యంత్రాంగం.. ఆ పనులకు రూ.137.08 కోట్లు మెటీరియల్ వ్యయం కింద ఖర్చు చేసింది. ఈ ఏడాది 229.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా 203.53 కిలోమీటర్ల నిడివితో 88.70 శాతం పనులు పూర్తి చేసింది. జిల్లాలో 975 గోకులాల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటికే లక్ష్యానికి మించి 1249 గోకులాలు నిర్మించింది.

ప్రజలను భాగస్వాములు చేయండి

- తిరుపతి పోలీస్ పనితీరు బాగుందంటూ సీఎం కితాబు

పోలీసు శాఖలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం. ఈ విషయంలో తిరుపతి ఎస్పీ చేపట్టిన చర్యలు బాగున్నాయి' అంటూ సీఎం చంద్రబాబు కొనియాడారు. అమరావతిలో మంగళవారం సీఎం అధ్యక్షతన జరిగిన సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, విజుబుల్ పోలీసింగ్ విషయంలో తిరుపతి పోలీసులు బాగా పనిచేస్తున్నారంటూ సీఎం చంద్రబాబు కితాబిచ్చారు. సైబర్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించి పెరగకుండా చూడాలి. ప్రతి రోజూ ఒక గ్రామం ఎంచుకుని పోలీసులు పల్లె నిద్ర చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు కాకుండా పోలీసులంటే ప్రజల్లో నమ్మకభావం కల్పించాలి. అత్యాచారాలు, గంజాయి కట్టడికి ఉక్కుపాదం మోపాలి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు' అని ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నేడు శాఖల వారీగా సీఎం సమీక్ష

కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా రెండో రోజైన బుధవారం జిల్లాపై సమీక్ష జరగనుంది. వివిధ శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోతుగా సమీక్షించనున్నారు. జిల్లా ప్రగతికి, అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:53 (గురువారం ఉదయం)

రేపు పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక

● రామిరెడ్డిపల్లిలో అప్రమత్తమైన పోలీసులు



పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రామిరెడ్డిపల్లె పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఆరు నెలల క్రితం ఉపసర్పంచ్, వైసీపీ మద్దతుదారు ఉమ వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు. 8 వార్డు సభ్యులకు గాను ముగ్గురు టీడీపీ మద్దతుదారులు, ఐదుగురు వైసీపీ మద్దతుదారులు ఉన్నారు. సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఓటింగ్‌లో పాల్గొంటారు. పంచాయతీలో గొడవలు జరిగే అవకాశాలు ఉన్నందున డీఎస్పీ ప్రసాద్, ఇన్‌చార్జి సీఐ ఇమ్రాన్‌బాషా, ఎస్‌ఐ అనిత, సిబ్బంది ఇప్పటికే టీడీపీ, వైసీపీ వర్గాలను గొడవలు చేయకూడదని హెచ్చరించారు. డీఎస్పీ ప్రసాద్ మంగళవారం రామిరెడ్డిపల్లెకు చేరుకుని ఎన్నిక జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు.

ఎర్రావారిపాలెం: చింతగుంట పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం జరగనుంది. ఈ సందర్భంగా మంగళవారం డీఎస్పీ ప్రసాద్ ,భాకరాపేట సీఐ ఇమ్రాన్ భాషాతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ పంచాయతీలో 10 మంది సభ్యులున్నారు. ఉప సర్పంచ్ బాలాజీనాయుడు 2023లో పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది.

చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ సంఘ నేతలు


చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగసంఘ నేతలు

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సిఫార్సు లేఖలపై సుపథం ద్వారా శ్రీవారి దర్శనం కల్పించేలా నిర్ణయం తీసుకున్నందుకు టీటీడీ ఉద్యోగ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశాయి. ఈమేరకు మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిసి వారు కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘ నేతలు పాల్గొన్నారు. సేవాభావంతో విధులను నిర్వహించి భక్తులకు సేవ చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు చైర్మన్ సూచనలు చేశారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలపై చైర్మన్‌కు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, హెల్త్ ఫండ్‌ను పెంచాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థి చేయూత


దాత బైరెడ్డి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీచర్లు,విద్యార్థులు

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.5.5 లక్షల రూపాయల వెచ్చించారు. దోర్నకంబాల ప్రాథమికోన్నత పాఠశాలలో బైరెడ్డి భానుప్రకాష్ చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారు. ఈక్రమంలో పాఠశాలకు 10 కంప్యూటర్లు, 10 కంప్యూటర్ టేబుళ్లు, 10 కుర్చీలు, 25 డెస్కులు వితరణ చేశారు. పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయించారు. క్రీడా మైదానం చదును చేయించారు. వంటగదినీ ఆధునీకరణ చేయించారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కంప్యూటర్ శిక్షణకు ఈయన సొంత ఖర్చుతో ట్యూటర్‌ను నియమించారు. 45 మంది విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్‌పై శిక్షణ ఇప్పించారు. శిక్షణ పూర్తి చేసుకొన్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా బైరెడ్డి భానుప్రకాష్‌ను ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. భానుప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, సంధ్యాలక్ష్మి, రాజేంద్ర, ఉమ, అనూష, గురవమ్మ పాల్గొన్నారు.

సాగు వివరాలు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న మనోహర్‌బాబు

తిరుపతి రూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పని సరిగా సాగువివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.మనో హర్ బాబు తెలిపారు. తిరుపతి డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుదారులందరూ స్థానిక సచివాలయాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల ఫోన్లకు రైతులు స్పందించి ఆధార్ ఓటీపీ వివరాలు అందించాలన్నారు.

పాడి ఆవు కోల్పోయిన రైతుకు పరిహారం అందజేత

పాకాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పులివర్తివారిపల్లెకు చెందిన రైతు కె మునెయ్యానాయుడు ఇటీవల పొలంలో పశువులు మేపుతుండగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగతెగి పడి రెండు ఆవులు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో పాడిఆవులు కోల్పోయిన రైతుకు మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని రూ.95వేలు పరిహారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, విద్యుత్ శాఖ డీఈఈ జీవన్ కుమార్ ఏఈ ప్రశాంత్, టీడీపీ నాయకులు ఫల్గుణ, కె.సురేష్, బొల్లినేని మహేష్ కుమార్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పశుమాంస దుకాణాలు



పాకాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య పశుమాంస దుకాణాలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాకాల భారతంమిట్ట 4,5,6,7 వీధుల ఉత్తరం వైపు చివర పూరిపేటకు దక్షిణం వైపు ఏడు పశుమాంస దుకాణాలున్నాయి. దుకాణాల సమీపంలో,ఇళ్లమధ్యలో పశువధశాలలున్నాయి. పశువుల వధ వ్యర్థాలతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలను మురుగుకాలువల్లోకి వదలివేస్తుండడంతో చాలా ఇబ్బంది ఎదురవుతోంది. ఈ ప్రాంత పరిసరాల్లోని ఇళ్లల్లో బాడుగలకు ఎవరూ రావడం లేదు. సొంత ఇళ్లలో ఉన్నవారు దుర్గంధం భరిస్తూ సతమవుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోడ కూలి ఒడిశా బాలిక మృతి

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టి గోడ కూలి ఒడిశా రాష్ట్రానికి చెందిన సునీతానాగ్(15) అనే బాలిక మృతి చెందింది. ఏటా ఒడిశా నుంచి నీలకంఠం నాగ్ కుటుంబం శ్రీకాళహస్తికి వచ్చి ఆరునెలలు పని చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుంటుంది. ఈ క్రమంలో మూడు నెలల క్రితం నీలకంఠం కుటుంబ సభ్యులతో పట్టణ శివార్లలోని ముచ్చివోలు రోడ్డు పక్కన పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె సునీతనాగ్ మంగళవారం బట్టీలో నీటి తొట్టె పక్కన స్నానం చేస్తుండగా గోడకూలి మీద పడింది. బాలికను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సునీతనాగ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

టీటీడీకి విరాళంగా కెమెరా


దాత తరఫున వెంకయ్య చౌదరికి కెమెరాను అందజేస్తున్న భానుప్రకాష్

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): టీటీడీకి మంగళవారం ఓ కెమెరా విరాళంగా అందింది. నెల్లూరుకు చెందిన వంశీరామ్ బిల్డర్స్ అధినేత వంశీరామ్ సుబ్బారెడ్డి రూ.8.84 లక్షల విలువైన కెనాన్ డిజిటల్ మిర్రర్ లెస్ కెమెరా, లెన్సులను టీటీడీకి విరాళంగా ఇచ్చారు. దాత తరుపున టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వాటిని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

రేపు ఉపాధి హామీ తనిఖీ బహిరంగ సభ

రామచంద్రాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ బహిరంగసభ గురువారం ఉదయం 10గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు. ఎంపీడీవో ఇందిరమ్మ మంగళవారం ఈమేరకు ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో గుర్తించిన పలు అంశాలను బహిరంగ సభ ద్వారా తెలియజేస్తామన్నారు. డ్వామా పీడీ శ్రీనివాప్రసాద్, మండల ప్రజాప్రతినిధులు హాజరవుతారని వివరించారు.

నేడు చంద్రగిరి వారపు సంత వేలం

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీలో వారపు సంత, ప్రయివేటు బస్టాండ్, జంతువధశాల రుసుముల వసూలకు బుధవారం ఉదయం పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఎంపీడీవో వెంకటరత్నం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మవారి సేవలో నాని దంపతులు

తిరుచానూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులను అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కల్వర్టును ఢీకొన్న కారు

నలుగురికి గాయాలు



పాకాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో గాదంకి సమీపంలోని మంగళవారం సాయంత్రం కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. రైల్వే కోడూరుకు చెందిన చంద్రశేఖర్, నరసింహారెడ్డి, కిరణ్ మరో వ్యక్తి కారులో తమిళనాడు తిరువణ్ణామలైకి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను రుయాసుపత్రికి తరలించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదం: ఇరువర్గాల ఘర్షణ

తిరుచానూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..తిరుచానూరు గంగమ్మ జాతర జరిగే సమీప ప్రదేశంలో భూమికి సంబంధించి ఇరువర్గాల మధ్య కొంతకాలంగా కోర్టులో కేసు నడుస్తోంది. ఇరువురు కూడా టీడీపీకి చెందిన వారే. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఆ భూమిలోకి ప్రవేశించి ఇరువర్గాల వ్యక్తులూ పరస్పరం దాడులు చేసుకున్నారు. కొంత మందికి గాయాలయ్యాయి. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శిల్పారామం ఏవోగా సుధాకర్

బాధ్యతల స్వీకరణ



తిరుచానూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శిల్పారామం ఏవోగా సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పులివెందుల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న ఖాదరవల్లి పుట్టపర్తికి బదిలీ అయ్యారు.

ముందుకెళ్లని మురుగుతో ఇబ్బందులు

● ఇందిరమ్మ గృహాల్లో సమస్యల తిష్ట


గృహసముదాయం వద్ద పారిశుధ్య పరిస్థితి ఇది

తిరుపతి రూరల్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ గృహ సముదాయాల్లో సమస్యలు తిష్ట వేశాయి. పారిశుధ్య నిర్వహణ లోపించడంతో మురుగునీరు, చెత్త పేరుకుపోయింది. డ్రైనేజీకి అవుట్‌లెట్ లేకపోవడంతో మురుగు బయటకు వెళ్లడంలేదు. మురుగునీటి నిల్వ చేరేందుకు బ్లాక్‌కు ఒకటి వంతున పెద్దసంప్‌లను ఏర్పాటు చేశారు. సంప్‌లు నిండిపోవడంతో ఏళ్లతరబడి తోడకుండా వదిలేశారు. దాంతో సంప్‌లలోని మురుగునీరు పొంగి సముదాయాల చుట్టూ చేరి అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థ పాడవ్వడంతో కొన్ని ఇళ్లలో నీరు బయటకు వెళ్లడంలేదు. చందాలు వేసుకుని అప్పుడప్పుడు మురుగుకాలువలు శుభ్రం చేసుకుంటున్నామని స్థానికులు చెబుతున్నారు. మంచినీటి ట్యాంకుల్లో బోరునీరు నీరు నిండాక మోటార్లను ఆఫ్ చేయడంలేదు. దీంతో నీరు వృథాగా పారి గోడలు పాచిపట్టి ఉన్నాయి. వీధిదీపాలు సరిగా వెలగడంలేదు. అవిలాల పంచాయతీ నుంచి విభజితమై ఈ కాలనీ గాంధీపురం పంచాయతీలోకి వచ్చింది. ఇటు పంచాయతీ అటు కార్పొరేషన్ అధికారులు సంబంధంలేనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మౌలిక సదుపాయాలు లేక కొందరు ఇళ్లను ఖాళీచేస్తున్నారు.

ఉద్యోగి ఇంట్లో చోరీ

బంగారు నగలు, వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25(ఆంధ్రజ్యోతి): మంగళంలో ఓ ఉద్యోగి ఇంట్లో దొంగలు పడ్డారు. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి కథనం మేరకు....హైదరాబాదుకు చెందిన అనిల్‌కుమార్ కరకంబాడిలోని అమరరాజా కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలసి హైదరాబాదు వెళ్ళారు. ఈ క్రమంలో దొంగలు ముందస్తు పన్నాగంతో ఆ ఇంటి కిటికీ గ్రిల్‌ను కట్ చేసి లోపలికి చొరబడ్డారు. 50 గ్రాముల బంగారు నగలు, 200 గ్రాముల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు అపహరించుకు వెళ్ళారు. మంగళవారం ఉదయం హైదరాబాదు నుంచి తిరిగి వచ్చిన అనిల్‌కుమార్ ఇంటి తాళాలు తెరచి వుండడంతో అవాక్కయ్యారు. వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే నాని ఇఫ్తార్ విందు


ముస్లింలకు విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీలకు అతీతంగా ముస్లింలకు ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం సాయంత్రం ఇక్కడి ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్ష విరమించిన వారికి పండ్లు పంపిణీ చేశారు. ముందస్తుగా వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన దృష్టికి మత పెద్దలు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇఫ్తార్ విందులో ఆయనే వడ్డించి, అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు గౌస్‌బాషా, మన్సూర్, రఫీ, వైసీపీ నాయకులు మస్తాన్, జార్‌బాహార్, తదితరులు పాల్గొన్నారు.

బోధన, పరిశోధన రంగాల్లో సహకారానికి కృషి

● అధికారులతో సమావేశమైన ఎమీలియా బి.స్మిత్


సమావేశంలో పాల్గొన్న ఇరు సంస్థల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు చెందిన పబ్లిక్ డిప్లొమసీ ఆఫీసర్ ఎమీలియా బి. స్మిత్ ఎస్వీయూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీల్లో సోమవారం పర్యటించారు. ఆయా యూనివర్సిటీ అధికారులతో సమావేశమయ్యారు. యూనివర్సిటీలకు అమెరికన్ సంస్థల నుంచీ బోధన, పరిశోధన రంగాల్లో తమ వంతు సహకారానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, ఉద్యోగుల పరస్పర మార్పిడికి కూడా ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. యూనివర్సిటీ ప్రగతి, విద్యార్థులు, ఉద్యోగుల సామర్థ్యాలపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని వివరించారు. ఈ సందర్భంగా ఎమీలియ బి.స్మిత్‌ను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు సుమన్‌ను ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మంగళవారం తిరుపతి విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలంకారీ వస్త్రంతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. నరేంద్ర, మునిరత్నం పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరుడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ షిటీజ్ బాలి, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి దర్శించుకున్నారు. అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

నేడు తిరుమలలో అన్నమయ్య వర్ధంతి

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాన్ని టీటీడీ బుధవారం తిరుమలలో నిర్వహించనుంది. ఈసందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠి గానం నిర్వహించనున్నారు.

టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు మంగళవారం రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు ఈ విరాళాన్ని డీడీ రూపంలో తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అదజేసి సర్వశ్రేయస్ ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి తొలగిన అడ్డంకులు


సర్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులు తొలగుతున్నాయి. ఇప్పటికే ఒకసారి శిలాఫలక ఆవిష్కరణ, రెండోసారి భూమిపూజ జరిగిన విషయం విదితమే. అయితే కల్యాణ మంపడ నిర్మాణానికి కేటాయించిన స్థలానికి సంబంధించి తెలుగు గంగ అధికారులు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం దీనిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో మంగళవారం తహసీల్దార్ రాజశేఖర్, తెలుగుగంగ డీఈ శ్రీహరి, టీటీడీ సర్వే అధికారుల బృందంతో ఎమ్మెల్యే వారపు సంత వద్దకు చేరుకున్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకుల తొలగింపుపై అధికారులతో చర్చించారు. గంగ కాలువ గట్టు నుంచి బఫర్ జోన్‌ను మినహాయించి మిగిలిన స్థలంలో మండపం నిర్మాణం చేపట్టడానికి మరో మారు సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో మండల సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్ గిరి, టీటీడీ సర్వేయర్ హరినాథ్, డిప్యూటీ సర్వే యర్ దీప, ఏఈ రుద్రరాజు, గురుప్రసాద్ బృం దం సర్వే నెం.35-2లో 0.92 సెంట్లు భూమికి సం బంధించి నలు దిక్కులా సర్వే చేసి రాళ్లను పాతారు. దీంతో నిర్మాణానికి సంబంధించి స్థల వివాదం తొలగింది. ఎట్టకేలకు కల్యాణ మంపడం పనులు ప్రారంభానికి మార్గం సుగమం అయ్యింది. ఈ కార్యక్రమంలో సర్పంచు మంజుల, సీఐ మురళి, విద్యుత్‌శాఖ ఏడీ రమేష్, నాయకులు పరమశివం(బాషా), శశిమోహన్ నాయుడు, మురళీనారాయణ, శివానందం, ప్రభాకర్‌రెడ్డి, బాబు యాదవ్ తదిదరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

కల్యాణ మండలం భూసర్వే అనంతరం పుదుకుప్పం చేరుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు సింగిల్ ఫేస్‌తో షిఫ్ట్ కరెంట్ ఉన్న గ్రామంలో ఇకపై 3ఫేస్‌తో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ప్రారంభించిన ట్రాన్స్‌ఫార్మర్లలో నాలుగు 100 కేవీ, ఒక 63 కేవీ ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

పూజలందుకున్న గంగమ్మ

● వేడుకగా పుంగనూరు జాతర ప్రారంభం

● వైభవంగా సాగిన అమ్మవారి ఊరేగింపు


గంగమ్మకు తొలిపూజ చేస్తున్న జమిందారీ కుటుంబీకులు

పుంగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జమీందారు వంశీకుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. స్థానిక నగరిలోని జమిందారీ ప్యాలెస్‌లో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య భక్తుల దర్శనార్థం ఉంచారు. రాత్రి జమిందారు కుటుంబీకులు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో గంగమ్మకు తొలిపూజ నిర్వహించారు. జమిందారు వంశీకులైన సోమశేఖర చిక్కరాయలు, మల్లిఖార్జున చిక్కరాయుల కుటుంబీకులు సుగుటూరు గంగమ్మకు చీర, సారె, పండ్లు, పూలు సమర్పించి పూజలు నిర్వహించారు.అనంతరం గంగమ్మకు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి,జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్యాలెస్‌లోని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ప్రముఖ న్యాయవాది వెంకటముని యాదవ్, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి అమ్మవారికి గెరిగెలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై సుగుటూరు గంగమ్మను తేరువీధి, సుబేదారు వీధి, కుమ్మరవీధుల మీదుగా తిరిగి నగరి ప్యాలెస్ వరకు బాణాసంచా పేలుళ్ళ, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా జంతుబలులిచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం అమ్మవారిని ప్యాలెస్ ఆవరణంలోని ఆలయంలో ప్రతిష్ఠించారు. జాతర సందర్భంగా పట్టణంలోని శక్తి అమ్మవార్లుగా నలుదిక్కుల్లో ప్రతిష్ఠింపబడిన నడివీధి గంగమ్మ, తూర్పుమొగసాల గంగమ్మ, మల్లారమ్మ గంగమ్మ, నల్లగంగమ్మ, విరూపాక్షి మారెమ్మ, బోయకొండ గంగమ్మలైన అష్టగంగమ్మల ఆలయాలకు ప్రజలు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. విరూపాక్షి మారెమ్మ ఆలయంలో భక్తులు గెరిగెలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. రాంపల్లె గంగమ్మను వైభవంగా ఊరేగించారు.


గంగమ్మ ఊరేగింపులో జనసందడి



గంగమ్మ దర్శనం నేడు మాత్రమే

నగరి ప్యాలెస్‌లోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనార్థం అమ్మవారిని బుధవారం ఒక్కరోజే నిర్వాహకులు ఉంచుతారు. మంగళవారం రాత్రి ఊరేగింపు అనంతరం బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో అమ్మవారిని స్థానిక ఆలయంలో ప్రతిష్ఠించాక భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. బుధవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి తూర్పుమొగసాల సమీపంలోని చాముండేశ్వరి ఆలయం వద్ద జలాభిషేకం నిర్వహించి తిరిగి గురువారం తెల్లవారు జామున గంగమ్మ ఉత్సవవిగ్రహాన్ని తీసుకొచ్చి ప్యాలెస్‌లో భద్రపరుస్తారు. అమ్మవారి దర్శనం మళ్లీ వచ్చే ఏడాది గంగజాతరకే భక్తులకు లభిస్తుంది. అంత వరకు అమ్మవారి విగ్రహం లేకుండా సుగుటూరు గంగమ్మ ఆలయం ఉంటుంది.

ఆరోగ్య కేంద్రానికి దారేదీ ?


భూమిలో పూడిపోయిన ఆస్పత్రి ప్రధానగేటు

తిరుపతి అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా గేటును నేలకు తగలకుండా రాకపోకలు వీలుగా ఏర్పాటు చేస్తారు. అయితే తిరుమలనగర్ గ్రామసచివాలయం పక్కన గత పాలకులు గ్రామీణ ఆరోగ్య కేంద్రం (తుడా క్వార్టర్స్‌లో) గేటు మాత్రం భూమిలో పూడిపోయేలా నిర్మించారు. ప్రహరీ లోపల ఆస్పత్రి ఆవరణంలో మట్టితోలి చదును చేయడంతో గేటు చాలావరకు పూడిపోయింది. గేటును తీయలేం. మూయలేం. దీంతో ఈ ప్రధాన మార్గం తొలినుంచి మూసే ఉంది. మరో గేటు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గేటు పూడిపోయేలా కాంట్రాక్టరు నిర్మించినా నాటి అధికారుల, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన గేటును వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేషనల్ జూడో పోటీలకు ఎంపికైన శివసాయి



తిరుపతి(క్రీడలు), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పల్లం గ్రామానికి చెందిన ఈ.శివసాయి జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 16న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శివసాయి అత్యుత్తమంగా రాణించి స్వర్ణపతకం కైవసం చేసుకున్నాడు. దాంతో ఈ నెల 28 నుంచి 31వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే జూనియర్ నేషనల్ జూడో చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. శాప్ ఛైర్మన్ రవినాయుడు, జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, కోచ్ గోపి అతడిని అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించండి : ఏఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు పాటిం చాలని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో శ్రీజ పాల సంస్థలో పనిచేస్తున్న దాదాపు 560 మంది ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో ప్రయాణించి ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

లా పరీక్షలు నిర్వహించండి : ఎస్‌ఎఫ్‌ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న లా పరీక్షలన్నీ వెంటనే నిర్వహించాలని ఎస్వీయూ వీసీ అప్పారావును ఎస్‌ఎఫ్ఐ నాయకులు అక్బర్, అశోక్, నరసన్న, వినోద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. సెమిస్టర్ ప్రారంభమై ఐదు నెలలైనా పరీక్షలు నిర్వహించలేదని తెలియజేశారు.

పద్మావతి వర్సిటీలో నైపుణ్య శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే మైక్రోసాఫ్ట్ ఎ-1 వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ ఉమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలో నేర్చుకోవాలన్నారు. ప్రత్యేకించి భాష, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంప్రసాఫ్ట్ సీఈవో మల్లిక్ మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్ ఆధారిత టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రతినిధి భవానీశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిక చేసిన 50 వేల మంది యువతకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కోయెనిగ్ సొల్యూషన్స్ ట్రైనర్లు అక్విందర్‌కౌర్ నేతృత్వంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అజ్యూర్ పవర్, బీఐ, ఏఐ వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ భేరి విజయవంతం చేద్దాం

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో ఏప్రిల్ 14వ తేదీన జరగనున్న ఎస్టీ వర్గీకరణ భేరి విజయవంతం చేయాలని ఏపీ యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జునరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులేని కారణంగా సమాజంలో యానాదులు వెనుకబడి ఉన్నారని, ఎస్టీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామయ్య, వెంకటరత్నం, చంగల్ రాయులు, వెంకటరమణ, వసంతమ్మ, నాగరాణి, జ్యోతి, రేవతి పాల్గొన్నారు.

రోస్టర్ విధానంలో సమాన కోటా కల్పించాలి

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): అనేక పోరాటాలు తరువాత సుప్రీం తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావడం హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ దండోర జాతీయ అధ్యక్షులు ఆర్.జె ప్రకాష్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంతో ఆయన మాట్లాడారు. రోస్టర్ విధానంలో మాదిగలకు 7శాతం, మాలలకు 7శాతం, రెల్లి కులానికి 1 శాతం అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఎస్వీయూ బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి ఎం.శివప్రసాద్ ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంపై సరైన రీతిలో పోలీసులు స్పందించడం లేదని, అందుకే ఎంఆర్‌పీఎస్ తరపున నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీ మంగళవారం పరిశీలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్లం గిరిధర్, గంధం శ్రీనివాస్, కృష్ణన్న, రాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గోవధపై అవగాహన 'వృషభ'


మాట్లాడుతున్న సినీ నటుడు జయప్రకాష్ రెడ్డి కుమార్తె మల్లికారెడ్డి

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోవధపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా తమ సినిమా వృషభ నిర్మించినట్లు హీరో జీవన్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జయప్రకాష్‌రెడ్డి కుమార్తె, కో ప్రొడ్యూసర్ మల్లికారెడ్డి మాట్లాడుతూ తిరుపతికి చెందిన హీరో, చిత్తూరుకు చెందిన డైరెక్టర్ కామరాజు, ప్రొడ్యూసర్ ఉమాశంకర్ చిత్రాన్ని చాలాచక్కగా రూపొందించారన్నారు. ఏప్రిల్ 4వ తేదీన సినిమా విడుదల కానుందని, తిరుపతి ప్రజలు సినిమాను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అలేఖ్య, కిట్టు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై 50 శాతం వడ్డీ మినహాయింపు

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులకు 50 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన జీవో నెంబరు 46 ప్రకారం ఇప్పటివరకు ఉన్న బకాయిలను మార్చి 31తేదీ లోపు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం ఇస్తున్నామని తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుపతి

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


కోదండరామాలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(టీటీడీ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామాలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలపిన మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాకు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు ఆలయానికి మూడు పరదాలు, నాలుగు కురాళాలు విరాళంగా అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ప్రధాన అర్చకులు ఏపీ.ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకురార్పణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ బుధవారం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణ చేపట్టనున్నారు. సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని ముత్యాలమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాల అనంతరం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గంగమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి మంగళవారం రూ.లక్ష విరాళం అందింది. తిరుపతికి చెందిన ఎస్.అరుణ, చంద్రశేఖర్‌రెడ్డి రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఈవో ఎ.జయకుమార్‌కు అందజేశారు. అర్చకులు దాతకు ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు ఇచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



తిరుపతి అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం అందజేశారు. 42వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన సత్యనారాయణకు రూ.3.5లక్షలు, 9వ డివిజన్ సంజయ్‌గాంధీకాలనీకి చెందిన మునిబాలకు రూ.50వేలు చెక్కుల రూపంలో చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, మహేష్‌యాదవ్, లోకేశ్, మధు, రుద్రకిషోర్, శిరీష, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ప్రొఫెసర్ వేమన, కోర్సు డైరెక్టర్ అరుణశ్రీ, ఈఎల్‌పీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) మార్చి25(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సెక్షన్ల లోని దొడ్డాపురం ఫీడర్‌లో విద్యుత్ తీగల మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. కేకే లే అవుట్, మిట్టవీధి, నాదమునివీధి, యాదవవీధి, ఆకుతోటవీధి, ఆర్‌ఎస్ జంక్షన్, పొర్లవీధి, రెడ్డి అండ్ రెడ్డి కాలని, పంటవీధి, దొడ్డాపురం వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తుడా టవర్స్ నిర్మాణం వేగవంతం చేయండి : వీసీ మౌర్య

తిరుపతి, మార్చి25(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వీసీ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుడా ప్లాట్ల అమ్మకాలు తదితర అంశాలపై మంగళవారం తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుడా టవర్స్‌కు వేలం పాట నిర్వహించగా విశేష స్పందన లభించిందన్నారు. రానున్న ఫిబ్రవరి లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు

తిరుపతి(జీవకోన), మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయస్వామికి వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆనంద్, రాజశేఖర్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్) మార్చి25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మునిరాజ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరాయి. ఈ ఆందోళనకు వారు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్ ఏడవ తేదీ కార్పొరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నాతో పాటు పికెటింగ్ నిర్వహిస్తామని స్పష్టంచేశారు. రెండవ రోజు దీక్షల్లో శ్రీనివాసులు, శివప్రసాద్ రెడ్డి, రవి, ఆరోగ్యదాస్, గుణ, గజ, వెంకటేష్ పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌ను నిర్మూలిద్దాం


మహిళలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(ఆటోనగర్) మార్చి25(ఆంధ్రజ్యోతి): మహిళలు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్ సునీత అన్నారు. సింగాలగుంటలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సమాఖ్య, శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల, ప్రసూతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుంటుబ బాధ్యతల్లో పడి ఆహార అలవాట్లను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ సకాలంలో పరిమిత భోజనం , వ్యాయామం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 49 మంది మహిళలకు బీపీ, షుగర్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కవిత, నివేదిత, మౌనిక, శరణ్య, రెడ్డెమ్మ, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి(వైద్యం), మార్చి 25(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఆయన సీఐటీయూ నేతలతో కలిసి మంగళవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ ఏజెన్సీని నిర్వహిస్తున్న అరబిందో సంస్థ కాంట్రాక్టు రద్దు కావడంతో వచ్చే కొత్త ఏజెన్సీ వారు కూడా పాత వారినే కొనసాగించాలని, వారికి రూ.26 వేల జీతం ఇవ్వాలని కోరారు. నేతలు విశ్వనాథరెడ్డి, నవీన్, ఉమాపతి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ అధ్యక్షుడిగా సత్యనారాయణే

తిరుపతి(కల్చరల్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి కొత్తవీధిలోని కన్యాక పరమేశ్వరి ఆలయ పాలకమండలి అధ్యక్షుడిగా పామిడి సత్యనారాయణ శెట్టి మాత్రమే ఉంటారని ఆలయ మీడియా కమిటీ ఛైర్మన్ నామా వరదరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ గౌరవ ఛైర్మన్ పదవి నుంచి పసుపర్తి గోపినాథ్, ఉపాధ్యక్ష పదవి నుంచి ఆయన కుమారుడు పసుపర్తి ఫణిసాగర్‌ను కమిటీ తొలగించిందని వివరించారు.

ఆగిన అద్దె బస్సులు..కాణిపాకం ప్రయాణికుల అవస్థలు



సీబీఎస్‌లో వరుసక్రమంలో ఆగిన కాణిపాకం ఆర్టీసీ అద్దె బస్సులు - కాణిపాకం పాయింట్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారుల నిబంధనలు ఇబ్బందికరంగా ఉందని కాణిపాకం వెళ్లే అద్దె బస్సుల డ్రైవర్లు నిరసనకు దిగారు. ఫలితంగా కాణిపాకం వెళ్లాల్సిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నగరంలోని ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను గరుడ వారధిపై కాకుండా కిందనే నడపాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు. అయితే వారధి కింద నడిపితే అదనపు సమయం తీసుకుంటోందని దీనివల్ల సమయానికి గమ్యస్థానం చేరలేకపోతున్నామని అద్దెబస్సుల డ్రైవర్లు పేర్కొంటున్నారు. నిర్దేశిత మూడు ట్రిప్పులు తిప్పలేమని అధికారులకు వివరించారు. అయితే అధికారులు ఇందుకు అంగీకరించలేదు. దీంతో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి ఎనిమిది బస్సులు బస్టాండుకే పరిమితమయ్యాయి. వరుసక్రమంలో పార్కు చేయడంతో బస్టాండులో స్థలాభావం ఏర్పడి పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. అలాగే బస్సుల కొరతతో కాణిపాకం వెళ్లే ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. చంటిబిడ్డల తల్లిదండ్రులు ఎండలకు మరింత ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ సొంత బస్సులు అడపాదడపా వచ్చినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. వాటిలోనూ సీట్లకోసం పాట్లు పడ్డారు. మధ్యాహ్నం 1.30గంటల వరకు కాణిపాకం ప్లాట్‌ఫామ్ బస్సుల్లేక బోసిపోయింది. ఈ క్రమంలో అద్దె బస్సుల సంఘం ప్రతినిధులు ఆర్టీసీ అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రయాణికులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. చివరకు అధికారులు మునుపటి వలె గరుడవారధిపైనే రాకపోకలు సాగించేలా అనుమతి ఇచ్చారు. దీంతో మధ్యాహ్నం నుంచి అద్దె బస్సులు యథావిధిగా కాణిపాకం నడిచాయి. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.



పాదాల మండపం వద్ద కీర్తనలు ఆలపిస్తున్న కళాకారుడు - కోలాటం ఆడుతున్న మహిళలు

రసరమ్యం.. మెట్లోత్సవం


సంకీర్తనలు ఆలపిస్తూ తిరుమలకు వెళ్తున్న కళాకారులు, భజన మండళ్ల సభ్యులు

తిరుపతి(టీటీడీ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి కృపకు పాత్రులయ్యారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు అన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు మంగళవారం ఉదయం అలిపిరిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అలిపిరి పాదాల మండపం వద్ద అన్నమాచార్యుల విగ్రహానికి ప్రత్యేక పూజలు, మెట్ల పూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది మహనీయుల అడుగుజాడల్లో నడిచి స్వామివారి కృపకు పాత్రులు కావాలనే తలంపుతో టీటీడీ మెట్లోత్సవం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, కళాకారులు, భజనమండళ్ల సభ్యులు సంకీర్తనలు చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.

దోమలు పుట్టకుండా చూడండి

తిరుపతి(వైద్యం), మార్చి 25(ఆంధ్రజ్యోతి): అనేక రకాల వ్యాధులకు దోమలే కారణమని అలాంటి దోమలు కుట్టకుండా కాకుండా అవి పుట్టకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ అన్నారు. జిల్లాలోని పాపానాయుడుపేట, రావిళ్లవారికండ్రిగ, శ్రీకాళహస్తిల్లోని ప్రభుత్వ ఆస్పత్రులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆస్పత్రుల పరిధిలో చేపట్టిన దోమల నివారణ చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం తప్పక డ్రైడే ఫ్రైడే పాటించాలని అందులో భాగంగా ఎక్కడా మురుకి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

ఘనంగా సంస్కృత వర్సిటీ వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన డీఆర్‌డీవో శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ సంస్కృత భాషలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ అత్యద్భుత ప్రగతిని సాధించిందన్నారు. రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు మాట్లాడుతూ రెండు వేల మంది విద్యార్థులు యూనివర్సిటీలో చదువుకుంటున్నారని తెలిపారు. ఇందులో నలుగురు విదేశీ విద్యార్థులు ఉండటం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆగమ పండితులను సత్కరించారు. క్రీడా, సాంస్కృతిక, ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రజనీకాంతశుక్లా, రంగనాథన్, ఆచార్య దక్షిణామూర్తిశర్మ, ఆగరాజు, ఉదయనహెగ్డే, లీనాచంద్ర, సీతారాం, వైష్ణవి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలి


రుయాస్పత్రి ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

తిరుపతి(వైద్యం), మార్చి 25(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని ల్యాబ్‌లో పారామెడికల్ విద్యార్థిను లను లైంగికంగా వేధిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. రుయాస్పత్రిలోని పారామెడికల్ విద్యా ర్థినులపై జరిగుతున్న లైంగిక దాడులను ఖండిస్తూ మంగళవారం రుయాస్పత్రి పరిపాలనా భవనం ముందు ఆయన ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవిప్రభును కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థి సంఘం నేతలు తిరుమలేష్, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్, యుగంధర్ పాల్గొన్నారు.

పీఠాధిపతులను కలిసిన టీటీడీ చైర్మన్



తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామిజీ, భీమనకట్టె మఠాధిపతి రఘువరేంద్ర తీర్థస్వామిజీని తిరుమలలోని వ్యాసరాజ మఠంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలు, సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. భక్తులు సంతృప్తిగా తిరుమల యాత్ర చేసుకునేలా టీటీడీ పనిచేయాలని పీఠాధిపతులు సూచించారు. అనంతరం చైర్మన్‌ను స్వామిజీలు శాలువాతో సన్మానించి, మహాభారతం గ్రంథాన్ని బహూకరించారు. టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

మేఘనాథరెడ్డికి చంద్రశేఖరరావు పురస్కారం

- వచ్చే నెల 13 న పురస్కార ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యువ కథా, నవలా రచయిత కెవి మేఘనాథరెడ్డికి డాక్టర్ వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం ప్రకటించారు. పలమనేరు మండలం కాలువపల్లెకు చెందిన మేఘనాథరెడ్డి 2019 లో 'కరిగిపోవే కన్నీటి చుక్క' కవితా సంపుటి, 2021 లో అగజాత', నవల, 2022 లో కలుంకూరి గుట్ట కథా సంపుటి, 2024 లో 'పాయిదరువులు' నవల వెలువరించారు. విమలాశాంతి, రజనీశ్రీ, గంటా కమలమ్మ, మహేశ్వరయ్య, భాగీరథి కథా పురస్కారాలు పొందారు. ఏప్రిల్ 13న చంద్రశేఖరరావు జయంతి సందర్భంగా గుంటూరులో నిర్వహించే సభలో పురస్కార ప్రదానం చేయనున్నట్టు డాక్టర్ వి. ప్రసూన తెలిపారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,358
తలనీలాలు సమర్పించినవారు: 27,024

పురుషోత్తముడికి పుష్పయాగం




స్నపనతిరుమంజనం - స్వామివారికి పుష్పయాగం

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంలో ఏమైనా లోపాలు చోటుచేసుకుని ఉంటే ప్రాయశ్చిత్తంగా ఈవేడుక నిర్వహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 7 నుంచి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. స్నపన తిరుమంజపం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాష్ట్రాల నుంచి టీటీడీ, దాతలు ద్వారా అందిన మూడున్నర టన్నుల పుష్పాలతో వేద పండితులు స్వామివారికి అర్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,అర్చకులు శేషాద్రిచార్యులు, బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్‌రెడ్డి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి లక్కీడిప్‌లో కన్సొలేషన్ బహుమతులు

కూపన్లు తీసి 125 మంది పాఠకుల ఎంపిక



కన్సొలేషన్ బహుమతుల కూపన్లను తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులు

1. ఆర్.మౌనిష్‌కుమార్, చిత్తూరు
2. జి. వినోద్, పూతలపట్టు
3. కె. పద్మావతి, తిరుపతి
4. జి. సుబ్బరత్నమ్మ , కందూరు, సోమల.
5. ఎ. రుత్విక, తిరుపతి
6. సి. నాగరాజు, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు.
7. సి. రామయ్య, పలమనేరు
8. ఎస్. భానుప్రకాష్, బందార్లపల్లి, పూతలపట్టు
9. కె. పల్లవి, మదనపల్లి
10. కె. భాస్కరయ్య, బెంగుళూరురోడ్డు, మదనపల్లి
11. పి. క్రిష్ణయ్య, కట్టకింద వెంకటాపురం, రామచంద్రాపురం
12. ఎ.తేజేష్‌రెడ్డి, పాకాల
13. పి. కళ్యాణ్‌కుమార్, తిరుపతి
14. ఎం. రాజేశ్వరి, రొంపిచెర్ల
15. ఎం.ఎన్.కరుణామాత, కలికిరి
16. ఎ.భాస్కర్, పలమనేరు
17. ఆర్. నిఖిత, అంగళ్లు, కురబలకోట
18. పి.ప్రభాకర్, పుంగనూరు
19. వి. సౌందర్యరాణి, విద్యానగర్ కాలనీ, తిరుపతి రూరల్
20. ఎం.మునిరత్నం నాయుడు, సి.మల్లవరం, తిరుపతి రూరల్
21. పి. వీరరాఘవులు, 10-మినిస్టర్ ఏరియా, చెన్నై
22. దీపక్ మనీషా, తిరుపతి
23. షేక్అన్వర్ బాషా, రేణిగుంట
24. వై. లీలావతమ్మ , ఖాదీకాలనీ, తిరుపతి
25. ఎ.నాగరాజు, శ్రీరాంనగర్, పుంగనూరు
26. కె.యుగంధర్, కొండకిందపల్లి, పూతలపట్టు
27. డాక్టర్ కె. ఈశ్వర్‌బాబు, వజ్జిరెడ్డిపల్లి, పూతలపట్టు
28. జే. రేవతి, కలికిరి
29. ఆర్.క్రిష్ణమూర్తి, పాత అలిపిరి రోడ్డు, తిరుపతి
30. ఎన్.మమత, రాజీవ్‌గాంధీనగర్ కాలనీ, తిరుపతి
31. ఎన్.గోవిందస్వామి, నంగమంగళం, గుడిపాల
32. కె. దామినిప్రియ, స్టాఫ్ క్వార్టర్స్, తిరుపతి
33. ఎం.నటరాజ్‌శెట్టి, బేరివీధి, కార్వేటినగరం
34. ఎల్.కమల్‌క్రిష్ణ, మధురానగర్, తిరుపతి
35. ఎ. స్వర్ణ, కొంకావీధి, తిరుపతి
36. పి. వెంకటరమణ, మంగళంపేట, పులిచెర్ల
37. కె.ఓంప్రసాద్, జీవకోన, తిరుపతి
38. టి. రామిరెడ్డి, అంబేద్కర్‌కాలనీ, చంద్రగిరి
39. వి.ఎస్. హర్షవర్ధన్, సంతపేట, చిత్తూరు
40. ఎం. భార్గవి, విజయ్‌నగర్ కాలనీ, మదనపల్లి
41. డి. సాయిఫణీంద్ర, శంకర్‌నాయుడు కాలనీ, తిరుచానూరు
42. ఎ. రమేష్, రెడ్‌క్రాస్ స్ట్రీట్, చిత్తూరు
43. సి.ఎం. చౌడప్ప, రామకుప్పం
44. ఎన్. గజపతి, తూగుండ్రం, జి.డి.నెల్లూరు
45. టి. నరసింహులు, బంగారుపాళెం
46. డాక్టర్ వి. శ్రీనివాసులునాయుడు, పోస్టల్ కాలనీ, తిరుపతి
47. ఎస్. మాధవన్, దొడ్డిపల్లి, చిత్తూరు
48. జి. చంద్రశేఖర్, శేషప్పతోట, మదనపల్లి
49. ఎ. రమేష్, మిట్టూరు, చిత్తూరు
50. కె. అమల, వైకుంఠపురం, తిరుపతి
51. జి.సునీల్, చింతపర్తి, వాయల్పాడు
52. జి. సుబ్రమణ్యం, ఎన్‌జిఓ కాలనీ, తిరుపతి
53. ఎస్.ఆర్. రఘుమ, ఎస్‌బిఐ కాలనీ, మదనపల్లి,
54. ఎస్. చిరంజీవులు రెడ్డి , కార్వేటినగరం
55. ఎస్. అరుణాచలం, కొప్పేడు హరిజనవాడ, నింద్ర
56. ఎస్. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రామకుప్పం
57. వి.లోహిత్‌కుమార్, కొంగారెడ్డి పల్లి, చిత్తూరు
58. ఎ. సురేష్, మునగలపాలెం, ఏర్పేడు
59. ఎస్. చర్వాణిశ్రీ, పి.కె. లేఔట్, తిరుపతి
60. వి. జ్యోతిష్మతి, గాంధీరోడ్డు, తిరుపతి
61. పి. రాంబాబు, కొర్లగుంట, తిరుపతి
62. భ్రమరాంబ, సత్యనారాయణపురం, తిరుపతి
63. కె. వెన్నెల, అన్నాసంపల్లి, రేణిగుంట
64. యామిని, ఎస్టీవి నగర్, తిరుపతి
65. జి.నాగభూషణమ్మ, ఎయిర్ బైపాస్‌రోడ్డు, తిరుపతి
66. బి.మోహనరంగారెడ్డి, శివాలయంవీధి, వరదయ్యపాలెం
67. శిల్పిక, వైష్ణవి నగర్, తిరుచానూరు
68. బి.ఎం.ఇందిరాకుమార్, హర్షిత హోటల్, వి.కోట
69. బి.మంజునాథ్, నడివీధి, వి.కోట
70. వి.రామచంద్రయ్య, రాధాక్రిష్ణ స్ట్రీట్, తిరుత్తణి
71. కె. క్రిష్ణమూర్తి, కెప్టెన్ లక్ష్మి వీధి, మదనపల్లి
72. డి. గంగాముని ప్రసాద్, పంట వీధి, తిరుపతి
73. వి. ఆనందరావు, ఎస్.డి.లేఔట్, తిరుపతి
74. సాహిద్‌షబీనా బేగం, తిరుచానూరు
75. జె.రాధాక్రిష్ణ, బాసరివీధి, వడమాలపేట
76. ఎస్.హర్షిణి, ముద్దుక్రిష్ణాపురం, పుత్తూరు
77. బి. కవిత, గాంధీపురం, తిరుపతి రూరల్
78. ఎం. రజని, చిత్తూరు
79. ఎ. శివమోహన్, లక్ష్మీనగర్ కాలనీ, పలమనేరు
80. డి. మోహన్, కె.టి.క్వార్టర్స్, తిరుపతి
81. డి. ప్రభాకర్, పుదిపట్ల, తిరుపతి రూరల్
82. కె. ధనలక్ష్మి, శాంతినగర్, తిరుపతి
83. డి.అశోక్, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు
84. టి. గిరిధర్, బాలాజీ కాలనీ, తిరుపతి
85. కె.ఆర్.పూజిత, మురకంబట్టు, చిత్తూరు
86. హేమ, ఆవులపెద్దిరెడ్డిగారి పల్లి, పులిచెర్ల
87. జి.సుభాషిణి, శివజ్యోతినగర్, తిరుపతి
88. జి.క్రిష్ణమనాయుడు, జీవకోన, తిరుపతి
89. ఎ.మేఘ, బి.ఎన్. కండ్రిగ
90. సుజాత, భారతినగర్, చంద్రగిరి
91. వి. జయంతి, శ్రీనగర్ కాలనీ, పలమనేరు
92. ఎం.శ్రీలక్ష్మి, ట్రిప్లికేన్, చెన్నై
93. వి. రామతులసి, ఆర్.సి.రోడ్డు, తిరుపతి
94. ఎస్. అక్బర్, భగత్‌సింగ్ కాలనీ, రేణిగుంట
95. సి.ఆర్.సమీరారెడ్డి, గంగవరం
96. ఎస్. విజేత, మాధవనగర్, తిరుపతి
97. డి. వెంకటరమణ, పెరుమాళ్లపల్లి, తిరుపతి
98. ఎం. సుబ్బరామిరెడ్డి, తోటపల్లి, పాకాల
99. పి. సతీష్‌కుమార్, నిమ్మనపల్లి
100. డి. వరలక్ష్మి, మాతమ్మగుడి వీధి, తిరుపతి
101. వి.భువన్‌కుమార్, అంజిమేడు, ఏర్పేడు
102. ఎస్. అక్బర్ జమీర్, రాంనగర్ కాలనీ, చిత్తూరు
103. పి. కాంతమ్మ, వేపమానువీధి, తిరుచానూరు
104. డి. శ్రీలేఖ, ఎస్.వి.నగర్, తిరుపతి
105. పి.వేణు, ఐతేపల్లి, చంద్రగిరి
106. పి. శ్రీనివాసులు, శ్రీనగర్‌కాలనీ, పలమనేరు
107. జి. భువనేశ్వరి, కె.కె. లేఔట్, తిరుపతి
108. పి.సుల్తాన రజియా, మునిరెడ్డినగర్, తిరుపతి
109. బి. ఉదయశంకర్, భగత్‌సింగ్ కాలనీ, పుంగనూరు
110. డి. వేణుగోపాల్, లక్ష్మీపురం, తిరుపతి
111. సుభద్ర, న్యూకాలనీ, చెన్నై
112. కె. కామేశ్వరరావు, ఉప్పరపల్లి, తిరుపతి
113. కె. వెంకోబరావు, డి.ఆర్.మహల్‌రోడ్డు, తిరుపతి
114. కె. యువరాజు, సత్యనారాయణపురం, తిరుపతి
115. ఎం. శ్రీనివాసులు, శివజ్యోతినగర్, తిరుపతి
116. పి. ముఖేష్, జీవకోన, తిరుపతి
117. ఎస్.రెడ్డీశ్వరి, సదుం
118. కె.ఎం. ఉషారాణి, ఎం.బి.రోడ్డు, పుత్తూరు
119. కె. తేజశ్రీ, రాటకొండ సరస్వతమ్మ వీధి, మదనపల్లి
120. పి.వి.దివ్యసాయి, గాంధీనగర్, కుప్పం
121. ఎం. రోహిత్, నిమ్మనపల్లి,
122. ఎ. జనార్ధన్‌రెడ్డి, గంగవరం
123. జి. కల్పన, గుంతలపేట, రామసముద్రం
124. ఎస్. సతీష్, రజకవీధి, పుత్తూరు
125. జి. చిరంజీవి, రాజీవ్ నగర్, మదనపల్లి

శ్రీవాణిట్రస్టు మంచి కార్యక్రమం: నటుడు సుమన్



తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): శ్రీవాణిట్రస్టు ద్వారా శ్రీవారిని దర్శించుకునే విధానం ఓ మంచి కార్యక్రమం అని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తుల్లో కొందరు తమ స్థాయికి తగ్గట్టుగా శ్రీవారిని దర్శించుకుంటారని, అందులో శ్రీవాణిట్రస్టు ద్వారా స్వామిని దర్శించుకునే పద్ధతి చాలా బాగుందన్నారు. ఎయిర్‌పోర్టులో కూడా ఈ టికెట్లను కేటాయిస్తుండటంతో చాలా మంది టికెట్లు పొంది తిరుపతిలోని స్థానిక ఆలయాలన్నీ దర్శించుకుని తిరిగి మరుసటి రోజు తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటున్నారన్నారు. ఇక, తన అభిమానులు, నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు అందరు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

పైరసీ క్వాలిటీతో వచ్చేస్తోంది

- సినీ నిర్మాత నాగవంశీ



తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): 'ఈమధ్య పైరసీ ఇబ్బందులు అధికమయ్యాయి. సినిమా విడుదలైన రెండు మూడు రోజులకే చాలా క్వాలిటీతో పైరసీ బయటికి వచ్చేస్తోంది. దాన్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తాం' అని సినీ నిర్మాత నాగవంశీ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన ప్రతిసినిమా విడుదలకు ముందు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా మారిందన్నారు. ఈవారంలో 'మ్యాడ్ స్క్వేర్' విడుదల సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.

కార్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వివిధ పార్కింగ్ ప్రదేశాల్లో కార్ల అద్దాలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. శ్రీకాళహస్తికి చెందిన హేమచంద్రారెడ్డి అనే వ్యక్తి తన కారును కూడా పక్కనే పార్కింగ్‌లో పెట్టి ఎవ్వరులేని సమయంలో భక్తుల కారు వెనుకభాగంలో ఉండే చిన్నపాటి అద్దాన్ని డ్రిల్లింగ్ యంత్రంతో పగులగొట్టి సెల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొచుకుపోతున్నాడు. ఈక్రమంలో భక్తుల ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు మంగళవారం అతన్ని అరెస్ట్ చేశారు. రూ.60 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, చెవికమ్మలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. హేమచంద్రారెడ్డిపై ఇప్పటికే పలు చీటింగ్ కేసులతోపాటు రౌడీషీట్ కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కార్లను పార్కింగ్‌లో ఉంచినప్పుడు విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

- పోలేరమ్మ ప్రతిష్ఠ



బంగారుచీరలో ముత్యాలమ్మ

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతర కన్నుల పండువగా మంగళవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారుచీరలో బంగారుచీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శంచుకున్న భక్తులు ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తూర్పు కనుపూరు వీధుల్లో ఉదయం ప్రారంభమైన ఘటం ఊరేగింపు సాయంత్రం వరకు సాగింది. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేసి విశిష్ఠ పూజలు జరిపారు. అనంతరం అర్ధ రథంపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమిట్ట మీద తాత్కాలికంగా పోలేరమ్మకు వేదిక ఏర్పాటు చేశారు. కోట మండలం సిద్దవకంలో గుడిసెలో కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తప్పెట్లు, తాళాల నడుమ మోసుకువచ్చి ప్రతిష్ఠించారు. గాలి గంటల చెట్టు వద్ద కుంభం పోశారు. భక్తులు వేయికండ్ల కుండలలో గండదీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకుని, మొలకు వేపాకులు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

'నవోదయ'కి 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్‌యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహల్, నితీషసాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపరని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులకు.. పునర్విచారణ నివేదికకు ముడిపెట్టొద్దు

- పుత్తూరు కౌన్సిల్ తీర్మానంపై ఆర్డీ విశ్వనాథ్



పునర్విచారణపై సమీక్షిస్తున్న ఆర్డీ విశ్వనాథ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు తదితరులు

పుత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య జరిగిన అవినీతి ఆరోపణలపై పారదర్శకంగా పునర్విచారణ సాగుతోందని పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) విశ్వనాథ్ పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులుతో కలిసి ఆర్డీ మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా పునర్విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందిస్తున్నామన్నారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రస్తావించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో పునర్విచారణ నివేదిక తరువాతే అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరుగుతుందన్న చైర్మన్ నిర్ణయం పట్ల ఆర్డీ విశ్వనాథ్ స్పందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులను, అవినీతి ఆరోపణలపై ఇచ్చే నివేదికకు ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. పునర్విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాల గురించి మీడియా ప్రశ్నించగా ఆర్డీ తోసిపుచ్చారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా త్వరలో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించి న జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9441456039 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- పావులు కదుపుతున్న కార్పొరేటర్లు
- ఎమ్మెల్యేతో భేటీ

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మున్సిపల్ పాలకమండళ్లు మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోంది. మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశంపెట్టాలంటే ఏపీ మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం పూర్తి కావాలి. ఈనెల 18వ తేదికి మేయర్‌గా డాక్టర్ శిరీష పదవీకాలం నాలుగేళ్లు పూర్తయింది. వైసీపీకి చెందిన ఆమెను మేయర్ పీఠం నుంచి దించేసి, కూటమి సభ్యురాలు అన్నా అనితను కూర్చోబెట్టాలని భావిస్తున్నారు. ఆమేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు రంగం సిద్ధం చేస్తున్నారు. అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చేందుకు అధికారులను విధివిధానాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది.

అవిశ్వాసానికి 26 మంది అవసరం

తిరుపతి కార్పొరేషన్లో ప్రస్తుతం 47 మంది కార్పొరేటర్లు ఉండగా, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ ఒక ఎమ్మెల్యే కలిపి 50 మందికి ఓటు హక్కు ఉంది. వీరిలో 50 శాతం అంటే 26 మంది నోటీసుపై సంతకాలు చేయాలి. ఇప్పటికే 10మంది వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన విషయం తెలిసిందే. టీడీపీకి చెందిన డిప్యూటీ మేయర్ ఆర్సీ మనికృష్ణతో పాటు అన్నా సిస్టర్స్ కాకుండా మరో 13 మంది వరకు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. అంటే ఎమ్మెల్యే ఓటుతో పనిలేకుండానే అవిశ్వాసానికి సరిపడా బలం కూటమికి సరిపోతుంది.

ఎమ్మెల్యే ఇంట్లో కార్పొరేటర్ల భేటీ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం కూటమి కార్పొరేటర్లు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలుచోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారని, మనం కూడా ముందడుగు వేయాలని చెప్పినట్టు తెలిసింది. కౌన్సిల్లో సరిపడా బలం ఉందని వైసీపీలో ఇమడలేక పలువురు కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నారని వివరించినట్టు సమాచారం. ఈనెల 29న జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి రానున్నారని, ఆయనతో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే చెప్పినట్టు తెలిసింది. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణతో పాటు కార్పొరేటర్లు ఎస్కేబాబు, అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర నాథ్, పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, వట్టికుంట నారాయణ, సీకే రేవతి, కల్పన తదితరులు ఎమ్మెల్యేతో సమావేశమైనవారిలో ఉన్నారు. కాగా మేయర్ వైసీపీనుంచి పోదని, తమ పార్టీకే కార్పొరేషన్ పీఠమని ఆపార్టీ స్థానిక నాయకత్వం దీమా వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసే అర్జీలను సంబంధితశాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరతగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య చికిత్సలకు అవసరమైన చెక్కులను అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చరణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్మెంటెడ్ సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. 20మంది రైతులకు సేంద్రియ ఎరువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు రాజీవన, తిరుపాల్, నాగార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు



విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న ఏవో సుజాత

వెంకటగిరి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ఏవో సుజాత అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద విశిష్ట సంఖ్య నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 6328 మంది రైతులకు గాను 3138 మంది మాత్రమే ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరగా వివరాలు నమోదు చేసుకుని విశిష్ట సంఖ్య పొందాలన్నారు. లేకపోతే ప్రభుత్వ పథకాలు అందవన్నారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, రేఖ, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్య, రైతులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను నెల్లూరులో కలపాలి



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను నెల్లూరు జిల్లాలో కలిపితే రైతులకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలోని వెంకన్నపాళెంలో గ్రామంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జిల్లాల పునర్విభజన చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రతీర ప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను రాయలసీమలో భాగం చేశారని తెలిపారు. రాయలసీమ పరిధిలో ఒక ఎకరానికి ధాన్యం 40 బస్తాలుగా నిర్ణయించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. నెల్లూరు జిల్లాలో ఎకరానికి 85 బస్తాల ధాన్యం కొనుగోలు చేసేవారన్నారు. తీర ప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను నెల్లూరు జిల్లాలో కలిపి రైతులకు న్యాయం చేయాలని కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోదండరామాలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి(టీటీడి), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండ రామాలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలపిన మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాదుకు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు ఆలయానికి మూడు పరదాలు, నాలుగు కురాళాలు విరాళంగా అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ప్రధాన అర్చకులు ఏపీ.ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకురార్పణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ బుధవారం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణ చేపట్టనున్నారు. సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వాస్పత్రికి రూ.1.50 లక్షల విరాళం



ఎమ్మెల్యే విజయశ్రీకి చెక్కును అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు, పక్కన ఆస్పత్రి అభివృద్ధి కమిటి సభ్యులు, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పెన్నెపల్లిలో ఉన్న ఎంఆర్ ఆగర్వాల్ కంపెనీ కార్పొరేట్ సమాజిక బాధ్యత కింద సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి రూ.1.50 లక్షలు విరాళంగా అందజేసింది. మంగళవారం కంపెనీ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, డిప్యూటీ మేనేజర్ సంతోష్, అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్ ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏలిమేటి సతీష్, హనుమంతరావు, సరిత, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, గాడి నారాయణరెడ్డి, శ్రీనివాసులు, పార్థసారధి, సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి - కోడూరు రోడ్డు కలేనా!

- కాగితాల్లోనే మగ్గుతున్న ప్రతిపాదనలు
- అటవీశాఖ క్లియరెన్స్ ఎప్పుడో ?
- పట్టించుకోని పాలకులు



వెంకటగిరి - పాళెంకోట రోడ్డు

వెంకటగిరి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - కోడూరు రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి కలగా మిగిలిపోతోంది. కడప, నెల్లూరు జిల్లా మధ్య రవాణా సౌకర్యం కల్పించే ఈ రోడ్డు ఏర్పాటు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. వెంకటగిరి - కోడూరు రోడ్డుకు 1990లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారు. వెంకటగిరి నుంచి పాళెంకోట వరకు వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. అక్కడి నుంచి వెలుగొండ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉండడంతో అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పారు. అటవీశాఖ క్లియరెన్స్ ఉంటేనే రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. అటవీశాఖ క్లియర్స్ కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వెలుగొండ కొండల్లో రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తే ఎర్రచందనం అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని స్థానిక అటవీశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో అటవీ క్లియరెన్స్ మంజూరుకు బ్రేక్ పడింది. ప్రస్తుతం వెంకటగిరి నుంచి రాజంపేట మీదుగా దాదాపు 120 కిలోమీటర్లు ప్రయాణించి కోడూరుకు చేరుకోవాలి. ఇందుకోసం సుమారు మూడు గంటల సమయం పడుతుంది. పాళెంకోట నుంచి వెలుగొండ అటవీ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మిస్తే 90 కిలోమీటర్ల దూరం తగ్గడంతో గంట సమయంలో కోడూరుకు చేరుకోవచ్చు. కడప, కోడూరు, రాజంపేట ప్రాంతాల నుంచి వెంకటగిరితో పాటు చెన్నైకి పెద్దసంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాళెంకోట నుంచి వెలుగొండల మీదుగా రోడ్డు నిర్మిస్తే ప్రయాణ దూరం తగ్గడంతో పాటు సమయమూ ఆదా అవుతుంది. ప్రజాప్రతినిధులు చొరవ చూపి వెంకటగిరి - కోడూరు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.





విద్యుత్ దీపాలంకరణలో ముత్యాలమ్మ ఆలయం - దేవతామూర్తుల కటౌట్లు

కాంతులీనుతున్న తూర్పు కనుపూరు



జాతరలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ మంగళవారం వేడుకగా ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో భక్తుల రాక మొదలవడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. బుధ, గురువారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ పెరగనుండడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఆలయం, పోలేరమ్మ ఆలయం వద్ద క్యూలైన్లను, ఆలయ ఆవరణలోని దుకాణాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సబ్‌కలెక్టర్, డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఈవో నవీన్‌కుమార్, సీఐ కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం కంచి కామకోటి పీఠం, టీటీడీ ఆస్థాన విద్యాంసుల ఆధ్వర్యంలో నాదస్వర కచ్చేరి నిర్వహించారు.

డాక్టర్ హరిప్రసాద్‌కు ఉత్తమసేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ హరిప్రసాద్

గూడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ కోసం కృషి చేస్తున్నందుకు సిద్దు అలర్జీ ఊపిరితిత్తుల ఆస్పత్రి డాక్టర్ హరిప్రసాద్ ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా తిరుపతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. తనకు వరుసగా ఆరుసార్లు పురస్కారం రావడం సంతోషంగా ఉందని డాక్టర్ హరిప్రసాద్ అన్నారు.

పోలేరమ్మ ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గూడూరు అర్బన్, మార్చి (ఆంధ్రజ్యోతి): స్థానిక జానకీరామ్ పేటలోని పోలేరమ్మ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి వినాయకపూజ, నవగ్రహపూజ, లలితసహస్ర పారాయణం, గోపూజ జరిపారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు పూజాకార్యక్రమాలలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా త్వరలో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441456039 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

లా పరీక్షలు నిర్వహించండి: ఎస్ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న లా పరీక్షలన్నీ వెంటనే నిర్వహించాలని ఎస్వీయూ వీసీ అప్పారావును ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, అశోక్, నరసన్న, వినోద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. సెమిస్టర్ ప్రారంభమై ఐదు నెలలైనా పరీక్షలు నిర్వహించలేదని తెలియజేశారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ప్రొఫెసర్ వేమన, కోర్సు డైరెక్టర్ అరుణశ్రీ, ఈఎల్‌పీ విద్యార్థులు పాల్గొన్నారు.

31లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

పెళ్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డులు ఈనెల 31లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకుంటే అన్ని ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయన్నారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు గిరిజన కాలనీలో పేదలకు మంగళవారం పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పొతుగుంట మల్లికార్జున రావు, సీడీపీవో మెహబూబి, సూపర్‌వైజర్ రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాక్సియాన్ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 12వ తేదీన యాక్సియాన్-2025 జాతీయ సదస్సు ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ హరనాథరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో నైపుణ్య శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే మైక్రోసాఫ్ట్ ఎ-1 వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ ఉమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలో నేర్చుకోవాలన్నారు. ప్రత్యేకించి భాష, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంపసాఫ్ట్ సీఈవో మల్లిక్ మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్ ఆధారిత టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రతినిధి భవానీశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిక చేసిన 50 వేల మంది యువతకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కోయెనిగ్ సొల్యూషన్స్ ట్రైనర్లు అక్విందర్ కౌర్ నేతృత్వంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అజ్యూర్ పవర్, బీఐ, ఏఐ వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయిద్దాం

తిరుపతి(ఆటోనగర్) మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్ సునీత అన్నారు. సింగాలగుంటలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సమాఖ్య, శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల, ప్రసూతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుంటుబ బాధ్యతల్లో పడి ఆహార అలవాట్లను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ సకాలంలో పరిమిత భోజనం , వ్యాయామం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 49 మంది మహిళలకు బీపీ, షుగర్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కవిత, నివేదిత, మౌనిక, శరణ్య, రెడ్డెమ్మ, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు చెట్టును ఢీకొన్న ఘటనలో మరొకరి మృతి

తడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద ఆదివారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్లను ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సంద్రీన్ ఫాతిమా(21), దీనదయాళ్(34) మృతి చెందారు. ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, చెన్నైలో చికిత్స పొందుతున్న ఎన్.మాదేష్(21) మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయశ్రీ



ప్రార్ధనలు చేస్తున్న విజయశ్రీ, టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు

సూళ్లూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటలో ఉన్న జామీయా మసీదులో మంగళవారం ముస్లిం పెద్దలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు మసీదు పెద్దలు స్వాగతం పలికి సన్మానించారు. ఎమ్మెల్యే పాటు టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ అక్బర్, అబ్దుల్ వహాబ్, రహంతుల్లా, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, కొక్కు శంకరయ్య, పార్థసారధి, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో థెరపీతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్టు రమేష్

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఫిజియోథెరపీ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులవుతారని డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హైదరాబాదులోని నిజామ్ ఇనిస్ట్యూట్‌కు చెందిన ఫిజియో థెరపిస్టులు రమేష్, సంతోష్‌కుమార్ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఫిజియో థెరపీపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు వృత్తిపరంగా, మానసికంగా ఎన్నో ఒత్తిడులకు గురవుతుంటారని, ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఫిజియో థెరపీ చేయాలన్నారు.

సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవం

దొరవారిసత్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెంలో రూ.7 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన 4 గోశాలలను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శ్రీహరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, గోపాల్‌రెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, షబ్బీర్, రాజేంద్రప్రసాద్, బాబునాయుడు, కిషోర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత వర్సిటీ వార్షికోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన డీఆర్‌డీవో శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ సంస్కృత భాషలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ అత్యద్భుత ప్రగతిని సాధించిందన్నారు. రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు మాట్లాడుతూ రెండు వేల మంది విద్యార్థులు యూనివర్సిటీలో చదువుకుంటున్నారని తెలిపారు. ఇందులో నలుగురు విదేశీ విద్యార్థులు ఉండటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీన్ రజనీకాంతశుక్లా, రంగనాథన్, ఆచార్య దక్షిణామూర్తిశర్మ, ఆగరాజు, ఉదయనహెగ్డే, లీనాచంద్ర, సీతారాం, వైష్ణవి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు నల్లగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో విశ్వబ్రాహ్మణవీధి నల్లగంగమ్మ, తెట్టు ప్రాంతంలో నల్లగంగమ్మ

శ్రీకాళహస్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 26న బుధవారం నల్లగంగమ్మ జాతర జరగనుంది. యేటా తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ జాతర రోజున శ్రీకాళహస్తిలో నల్లగంగమ్మ జాతర జరగడం ఆనవాయితీ. ఈ వేడుకను పురస్కరించుకుని మూడు రోజుల ముందు నుంచే తెట్టు వద్ద నల్లగంగమ్మ ఆలయంలో పాలకమండలి ఛైర్మన్ కంఠా రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజామున ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుంది. తిరిగి రాత్రి నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. ఇక ఇక్కడికి సమీపంలోని విశ్వబ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న నల్లగంగమ్మ ఆలయంలో మూలమూర్తికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలతో కుంభం సమర్పించారు. బుధవారం భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

సిద్ధిరాజు కండ్రిగలో చోరీ



చిందరవందరగా ఉన్న బెడ్‌రూం

పిచ్చాటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపు ధ్వంసం చేసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు... సిద్ధిరాజు కండ్రిగకు చెందిన శంకర్‌రాజు ఈనెల 21న అనారోగ్యంతో తిరుపతి నగరంలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లాడు. అయితే మంగళవారం ఉదయం శంకర్‌రాజు ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్టు చుట్టుపక్కల వాళ్లు గుర్తించారు. వెంటనే ఆయనకు ఫోన్ చేశారు. శంకర్‌రాజు సిద్ధిరాజు కండ్రిగకు చేరుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసినట్టు గుర్తించాడు. అందులో పది తులాల బంగారం, 4.5 కిలోల వెండి, రూ.10 వేలు, 25 యూఎస్ డాలర్లు, 170 మలేసియా రింగిట్స్ చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వెంకటేష్ సిబ్బంది సహా క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి ఒడిశా బాలిక మృతి



సునీతానాగ్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టి గోడ కూలి ఒడిశా రాష్ట్రానికి చెందిన సునీతానాగ్(15) అనే బాలిక మృతి చెందింది. యేటా ఒడిశా నుంచి నీలకంఠం నాగ్ కుటుంబం శ్రీకాళహస్తికి వచ్చి ఆరునెలలు పని చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుంటుంది. ఈ క్రమంలో మూడు నెలల క్రితం నీలకంఠం కుటుంబ సభ్యులతో పట్టణ శివార్లలోని ముచ్చివోలు రోడ్డు పక్కన పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్నారు. నీలకంఠం రెండో కుమార్తె సునీతనాగ్ మంగళవారం బట్టీలో నీటి తొట్టి పక్కన స్నానం చేస్తుండగా గోడకూలి మీద పడింది. బాలికను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చ్యురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

పుత్తూరు వార్తలు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 120 మంది ఎంపిక



పుత్తూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 120 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. జాబ్ అచీవర్స్ డే సందర్భంగా ఇంటర్వ్యూలు జరిగినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చిన్నలాలప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ సదస్సులో 42 ఫిర్యాదులు

పుత్తూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సదస్సు రెండో రోజున 42 ఫిర్యాదులు అందాయని పుత్తూరు డీఈ ఆశీర్వాదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గృహ వినియోగదారులు సోలార్ పథకాన్ని తీసుకుంటే కేంద్రప్రభుత్వం రూ.30 వేల రాయితీ ఇస్తుందని తెలిపారు. అలాగే వినియోగదారులు అదనపు కిలోవాట్‌కు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకుంటే 50 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. పుత్తూరు, నాగలాపురం ఏడిఈలు శంకరయ్య, రమేష్, ఏఈలు పాల్గొన్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డు ఉంటేనే రైతులకు పథకాల లబ్ధి

వడమాలపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో ప్రతి రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య(కార్డు) ఇవ్వాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టిందని ఏవో విజయ్‌కుమార్ చెప్పారు. వడమాలపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వడమాలపేట మండలంలో 74.5 శాతం మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు నెలాఖరులోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య తీసుకోని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వర్తించే అన్ని రకాలు సబ్సిడీ పథకాలు, పీఎం కిసాన్, అన్నదాన సుఖీభవ అందదన్నారు. దీని కోసం రైతులు ఆధార్‌కార్డు పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ నెంబర్ లింక్ అయినా మొబైల్‌ఫోను తీసుకురావాల్సి ఉందన్నారు.

శివాలయంలో గజ్జ పూజ



పుత్తూరు టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదా శివేశ్వర ఆలయంలో గజ్జ పూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లాస్య తరంగిణి నృత్యాలయం మాస్టర్ బాలాజీ ఆధ్వర్యంలో గజ్జ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయంలో నృత్యార్చన చేశారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

31లోగా పన్ను చెల్లించండి

పుత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లింపుల్లో వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఈనెల 31వ తేదీలోపు చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఆస్తి పన్నులో చెల్లించిన వడ్డీని 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్నుపై సర్దుబాటు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, మున్సిపల్ అధికారులు ఇటీవల ముకుపిండి పన్నులు వసూళ్లకు పాల్పడ్డారు. గడిచిన 5 రోజుల్లో దాదాపు రూ.50 లక్షలు వరకు ఆస్తి పన్ను వసూలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో వడ్డీ రూపేణ రూ.10 లక్షల వరకు మున్సిపాలిటీకి చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో ఇప్పటి వరకు పన్ను చెల్లించిన బకాయిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము 50 శాతం వడ్డీ కోల్పోయామంటున్నారు. మున్సిపల్ అధికారులపై కూడా పన్ను వసూళ్ల విషయమై ఒత్తిడి నెలకొంది. అంతే కాకుండా పన్ను వసూళ్ల ఆధారంగా 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు కూడా ఉంటుంది. ఈ క్రమంలో అధికారుల పన్ను బకాయిదారుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. పన్ను రాయితీ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా స్పష్టమైన నిర్ణయం వెలువరిస్తే అధికారులపై ఒత్తిడి, పన్ను బకాయిదారులకు ఊరట లభిస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్‌లో ఉన్న మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కరీముల్లా, సురేంద్రరెడ్డి, ఆంటోని, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి తొలగిన అడ్డంకులు



సర్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులు తొలగుతున్నాయి. ఇప్పటికే ఒకసారి శిలాఫలక ఆవిష్కరణ, రెండోసారి భూమిపూజ జరిగిన విషయం విదితమే. అయితే కల్యాణ మంపడ నిర్మాణానికి కేటాయించిన స్థలానికి సంబంధించి తెలుగు గంగ అధికారులు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం దీనిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో మంగళవారం తహసీల్దార్ రాజశేఖర్, తెలుగుగంగ డీఈ శ్రీహరి, టీటీడీ సర్వే అధికారుల బృందంతో ఎమ్మెల్యే వారపు సంత వద్దకు చేరుకున్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకుల తొలగింపుపై అధికారులతో చర్చించారు. గంగ కాలువ గట్టు నుంచి బఫర్ జోన్‌ను మినహాయించి మిగిలిన స్థలంలో మండపం నిర్మాణం చేపట్టడానికి మరో మారు సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో మండల సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్ గిరి, టీటీడీ సర్వేయర్ హరినాథ్, డిప్యూటీ సర్వేయర్ దీప, ఏఈ రుద్రరాజు, గురుప్రసాద్ బృందం సర్వే నెం.35-2లో 0.92 సెంట్లు భూమికి సంబంధించి నలు దిక్కులా సర్వే చేసి రాళ్లను పాతారు. దీంతో నిర్మాణానికి సంబంధించి స్థల వివాదం తొలగింది. ఎట్టకేలకు కల్యాణ మంపడం పనులు ప్రారంభానికి మార్గం సుగమం అయ్యింది. ఈ కార్యక్రమంలో సర్పంచు మంజుల, సీఐ మురళి, విద్యుత్‌శాఖ ఏడీ రమేష్, నాయకులు పరమశివం(బాషా), శశిమోహన్ నాయుడు, మురళీనారాయణ, శివానందం, ప్రభాకర్‌రెడ్డి, బాబు యాదవ్ తదిదరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

కల్యాణ మండలం భూసర్వే అనంతరం పుదుకుప్పం చేరుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు సింగిల్ ఫేస్‌తో షిఫ్ట్ కరెంట్ ఉన్న గ్రామంలో ఇకపై 3ఫేస్‌తో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ప్రారంభించిన ట్రాన్స్‌ఫార్మర్లలో నాలుగు 100 కేవీ, ఒక 63 కేవీ ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

ఆగమానుసారంగా ఆలయాల అభివృద్ధి



విజయేంద్ర సరస్వతితో మాట్లాడుతున్న సుధీర్ -



గురు దక్షిణామూర్తి సన్నిధిలో విజయేంద్ర సరస్వతి

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆగమ నియమాలను అనుసరిస్తూ ఆలయాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ తెలిపారు. విజయయాత్రలో భాగంగా నాలుగు రోజుల నుంచి శ్రీకాళహస్తిలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి పూజలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వామీజీ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి వైదిక లాంఛనాలతో పీఠాధిపతికి సాదర స్వాగతం పలికారు. ఆయన దర్శనానంతరం ఎమ్మెల్యే సుధీర్ కలిసి ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయం, గుడిమల్లం పరశురామేశ్వరాలయాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆగమ నియమాలను పాటిస్తూ ముందుకు పోతామని తెలిపారు. ఇక శ్రీకాళహస్తిలో వేదపాఠశాలను నెలకొల్పే విషయంపై పీఠాధిపతి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఎంఏ కన్వీనర్



శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కన్వీనర్ డాక్టర్ షితీజ్ బాలి, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, రమణ, వి.కృష్ణయ్య, చందురాయల్, కుమార్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై శిక్షణ అవసరం

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణపై విద్యార్థినులు శిక్షణ పొందడం ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం కరాటే మాస్టర్ దేవా ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్సుపై మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు జాగ్రత్తగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఇందిర, సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు సుమన్‌ను ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి మంగళవారం తిరుపతి విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలంకారీ వస్త్రంతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. నరేంద్ర, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏకమొత్తంగా పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘ పరిధిలో ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్ను ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నును ఈనెల 31 తేదీ లోగా చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు వడ్డీతో కలిపి కట్టిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేస్తారన్నారు. పన్నులచెల్లింపు కోసం పురపాలకసంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌నుకూడా ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా వార్డు సచివాలయంలో కానీ, నెట్‌బ్యాంకింగ్ ద్వారా, క్రెడిట్, డెబిట్‌కార్డుల ద్వారా కూడా ఈ నెల 31లోపు చెల్లించవచ్చన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు

కేవీబీపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడుకు చెందిన మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు మణి, ఆయన కుమారుడు సుమన్ తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం ధర్నా చేశారు. మాజీ ఎంపీపీ కుమారుడు సుమన్ గత 9 నెలలుగా రాయపేడులో ఉపాధిహామీ పథకంలో మేట్‌గా పని చేస్తున్నాడు. గతంలో అక్కడ పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను సమస్యల కారణంగా అధికారులు పక్కన పెట్టారు. అయితే పేద కూలీలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో సుమన్‌ను మేట్‌గా నియమించి అతని పేరు మీద లాగిన్ ఓపెన్ చేశారు. 9 నెలలుగా ఆయన లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అతనిపై రాయపేడు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో రాధారాణి... సుమన్ లాగిన్‌ను రద్దు చేశారు. పూర్వాపరాలను పరిశీలించిన తరువాత ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు నియామకంపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ఆదేశాలతో ఎంపీడీవో దాన్ని అమలు చేశారు. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ మణి తన కుటుంబసభ్యులతో ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో, ఏపీడీ సరిత, ఏపీవో భాస్కరయ్య వారితో చర్చించారు. అధికారుల ఆదేశాలను అమలు చేశామని విచారణ తరువాత న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సర్దుబాటైంది.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త లను తన ప్రాణప్రదంగా భావించి వారి అభివృద్ధి కోసం పాటుపడుతానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగ ళవారం ఆయన పార్టీ శ్రేణు లతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... అసెంబ్లీ సమావేశాల నుంచి వచ్చిన వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. టీడీపీ కుటుంబ సాధికార కమిటీ సభ్యులను ఈ నెలాఖరులోపు నియమిస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, విజయకుమార్, గాలి మురళీనాయుడు, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి పరిశ్రమల వ్యర్థాలపై ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీ శంకరపురం చెరువులోకి సమీపంలో ఉన్న పరిశ్రమల నుంచి వ్యర్థాలను వదులుతున్నారని సర్పంచ్ రాజయ్య గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో త్రివిక్రమ్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెరువులోకి రెండు పరిశ్రమల వ్యర్థాలను వదులుతుండడంతో నీరు కలుషిత మవుతోందన్నారు. ఆ నీటిని పశువులు తాగి రోగాలబారిన పడుతున్నట్లు తెలిపారు. వ్యర్థాలను చెరువులోకి వదలొద్దని పలుమార్లు పరిశ్రమల యాజమాన్యాలకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అదే విదంగా ఉపాధి హామీ పథకంలో చెరువు కట్టపై ఉన్న చెట్లు, పుట్టలు తొలగించడానికి మంజూరైన పనులను కూలీలతో కాకుండా యంత్రాలతో చేయించారని తెలిపారు. చెరువులోకి పరిశ్రమ వ్యర్థాలు రానియకుండా చూడాలని , ఉపాధి పనులు కూలీల దగ్గర చేసించే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు.

మంచినీళ్ల గుంటలో గడ్డికి నిప్పంటించిన ఆకతాయిలు



రేణిగుంట, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంచినీళ్ల గుంటలో కొంత మంది ఆకతాయిలు నిప్పు అంటించారు. మంచినీళ్ల గుంటలో ఉదయం, సాయంత్రం వేళల్లో పలువురు వాకింగ్‌కు వస్తుంటారు.గుంట లోపల ఏర్పాటు చేసిన బెంచీల్లో మధ్యాహ్నం పూట భిక్షగాళ్లు సేద తీరుతుంటారు. అలాగే స్థానిక ఆకతాయిలు గుంపుగా చేరుతుంటారు. ఈ క్రమంలో గుంట చుట్టూ ఎండు గడ్డికి ఎవరో నిప్పంటించారు. మంటలకు గాలి తోడవంతో క్షణాల్లో గుంట చుట్టూ వ్యాపించాయి. దీంతో గుంటు చుట్టూ ఉన్న వారు బక్కెట్లలో నీరు తీసుకొచ్చి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నగేష్, కార్యదర్శి మణి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పించారు.

తొమ్మిదేళ్లుగా నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



తిమ్మయ్యగుంట ట్యాంకు వద్ద నిరసనలో మహిళలు, సీపీఎం నాయకులు

రేణిగుంట, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించిన ట్యాంకు 9 ఏళ్లగా ప్రారంభానికి నోచుకోలేదని సీపీఎం నాయకులు స్థానిక మహిళలతో కలిసి ట్యాంకు ముందు నిరసన తెలిపారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ తిమ్మయ్యగుంటలో తొమ్మిదేళ్ల క్రితం గ్రామస్తులకు నీటిని సరఫరా చేయడానికి అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో రూ.15.50 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తైనా ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో సీపీఎం నాయకులతో కలిసి స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ స్పందించి ట్యాంకును ప్రారంభించాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా కొందరు స్థానికులు నీటిని నేరుగా వదలాలని, మరి కొందరు ట్యాంకు నుంచి సరఫరా చేయాలని కోరడంతో ట్యాంకు ప్రారంభం ఆలస్యమవుతోందన్నారు. ఇటీవల బోరు వేశామని త్వరలో కనెక్షన్ ఇచ్చి ట్యాంకును అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు.

నేడు పంచాయతీ గదుల వేలం

నాగలాపురం, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): నాగలాపురం పంచాయతీకి సంబంధించి 2025-26 సంవత్సరానికి గదులకు ఈనెల 26న బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పంచాయతీ షాపింగ్ గదులు, మధ్యాహ్నం 2 గంటలకు వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండు, జంతువధ శాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు సాల్వెన్సీ సర్టిఫికెట్ పొంది దరావతు చెల్లించాల్సి ఉందన్నారు.

రైతులకు విద్యుత్ సర్వీసులపై అవగాహన

వరదయ్యపాళెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు విద్యుత్ సర్వీసుపై నాగలాపురం డీఈ రమేష్, ఏఈ విజయ వెంకట్ అవగాహన కల్పించారు. అదే విదంగా వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపాండూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పాండూరు, రాచర్ల, పాదిరికుప్పం, యానాదివెట్టు, కోవూరుపాడు, వెంగారెడ్డికండ్రిగ, సిద్ధేశ్వరపురం, తొండం బట్టువాసులు, రైతులు పాల్గొన్నారు.